క్లుప్తంగా

పరామర్శ



నరసింహారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విజయరాజు

లింగపాలెం: ఇటీవల మృతిచెందిన వైఎస్సార్ సీపీ నాయకుల కుటుంబసభ్యులను ఆ పార్టీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కె.విజయరాజు బుధవారం పరామర్శించారు. కలరాయనగూడెంలో ఇటీవల మృతిచెందిన మసునూరు అప్పారావు కుటుంబాన్ని, భోగోలు పంచాయతీ వెంకటాపురం గ్రామంలోని బంతు నరసింహారావు (శ్రీను) కుటుంబాన్ని విజయరాజు పరామర్శించి, పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. విజయరాజు వెంట మండల అధ్యక్షుడు అన్నపనేని శాంతారావు, సర్పంచ్ రవిబాబు, ఎంపీటీసీ ప్రభాకరరావు, మండల సీనియర్ నాయకులు ఉప్పలపాటి ప్రసాద్, సూరిబాబు, లింగారావు, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

సహస్రనామ పారాయణ



సహస్రనామ పారాయణ చేస్తున్న మహిళలు

కొయ్యలగూడెం: భగవాన్ శ్రీ సత్య సాయి బాబా మందిరంలో బుధవారం వంద మంది మహిళలు ఏక సమయంలో లలితా సహస్రనామ పారాయణ నిర్వహించారు. స్వామివారి శతజయంతి సంవత్సరం సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టారు. మహిళలకు పసుపు, కుంకుమలు, రవిక, విభూది స్వామి వారి చిత్రపటాలను మందిరం నిర్వాహకులు అందజేశారు. పారాయణలో పాల్గొన్న వారిని సత్కరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రామాలయానికి డీజే సౌండ్ సిస్టమ్



సౌండ్ సిస్టమ్‌ను అందజేస్తున్న దృశ్యం

పోలవరం రూరల్: పోలవరం పంచాయతీ పరిధిలోని పాత పోలవరం రామాలయానికి అవసరమైన డీజే సౌండ్ సిస్టమ్‌ను బహూకరించారు. పోలవరం సర్పంచ్ పాడుం పుష్ప, పాడుం శ్యామ్‌కుమార్‌లను రామాలయ నిర్వాహకులు కోరడంతో బుధవారం అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ

లింగపాలెం: మండలంలోని రంగాపురం గ్రామ పంచాయతీని బుధవారం జెడ్పీ సీఈఓ ఎం శ్రీహరి పరిశీలించారు. గ్రామ పంచాయతీలో శానిటేషన్ పనులను పరిశీలించారు. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్త వేరు చేసి సేకరించుట, ఐవీఆర్ఎస్ కాల్స్‌పై ప్రజలకు అవగాహన కలిప్పించుట, ఎస్‌డబ్ల్యూపీసీ పనులను పరిశీలించారు. ప్రజలకు పారిశుద్ధ్యం ఆరోగ్యం అభివృద్ధి గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎ.సుందరి, పంచాయతీ కారుదర్శులు చంద్రశేఖర్, ఎం సుగుణరాజు, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

కొయ్యలగూడెం: ఉచిత నేత్ర వైద్య శిబిరం పీహెచ్‌సీలో బుధవారం నిర్వహించారు. నిడదవోలు రాజరాజేశ్వరి కంటి హాస్పటల్ వారి సౌజన్యంతో 47 మంది నేత్ర పరీక్షలు నిర్వహించారు. వీరిలో 13 మందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరమని, ప్రత్యేక వాహనంలో నిడదవోలుకు తరలించారు. వైద్యులు ఎస్‌కే తస్లీమా, ఉమాశంకర్, సీహెచ్ చక్రవర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

సంకష్ట చతుర్థి పూజలు



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం శ్రీ హరిహరసుత అయ్యప్పస్వామి ఉపాలయమైన కన్నెమూల గణపతి ఆలయంలో బుధవారం సంకష్ట చతుర్థి పూజలు ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి పంచామృతాభిషేకాలు, గణపతిహోమం అర్చకులు నిర్వహించారు. ట్రస్ట్ సభ్యులు ప్రెసిడెంట్ చిన్ని వాసుస్వామి దంపతులు పూజలో పాల్గొన్నారు.

చెరువులను తలపిస్తున్న గుంతలు

- అధ్వానంగా చింతలపూడి – టి.నరసాపురం రహదారి
- ప్రయాణానికి పాట్లు



అధ్వానంగా ఉన్న చింతలపూడి - టి.నరసాపురం రహదారి



టి.నరసాపురం యూనియన్ బ్యాంకు ఎదుట చెరువులను తలపిస్తున్న రోడ్డు

టి.నరసాపురం: టి.నరసాపురం – చింతలపూడి వరకు ఉన్న 10 కిలో మీటర్ల రహదారి అధ్వానంగా మారింది. ఈ రహదారిపై అడుగడుగునా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి చెరువులను తలపిస్తున్నాయి. ఈ మార్గంలో 10 నిమిషాలు పట్టే ప్రయాణం దాదాపు గంట సమయం పడుతోందంటే రోడ్డు దుస్థితిని అర్థం చేసుకోవచ్చు. దీంతో రాకపోకలకు టి.నరసాపురం మండల ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం గోతులను పూడ్చి మరమ్మతులు కూడా చేపట్టడం లేదని వారు వాపోతున్నారు.

వినతులపై స్పందన కరువు

ఈ రహదారిని అభివృద్ధి చేయాలని మండల ప్రజలు, సామాజికవేత్తలు ప్రభుత్వానికి, జిల్లా అధికారులకు వందల సార్లు వినతులు సమర్పించారు. పీజీఆర్ఎస్‌లో పదుల సంఖ్యలో మొరపెట్టుకున్నారు. అయినా ఏ మాత్రం ప్రయోజనం లేకుండా పోయింది. ఈ తరుణంలో 10 రోజుల క్రితం టి.నరసాపురానికి చెందిన సామాజిక వేత్త కటకం వెంకటేశ్వరరావు కొద్ది మంది ఆర్థిక సాయంతో తన సొజన్యంతో దాదాపు రూ.87 వేలు ఖర్చుచేసి జేసీబీ సాయంతో కొంత వరకు గోతులను పూడ్చించారు. టి.నరసాపురం మండల ప్రజలు ప్రతి నిత్యం, ప్రతి చిన్న అవసరానికి 10 కిలో మీటర్ల దూరంలో ఉన్న చింతలపూడిపైనే ఆధారపడి ఉన్నారు. మెరుగైన వైద్యం కోసం, నిత్యావసరాల కోసం నిత్యం చింతలపూడి వెళ్లాల్సిందే. 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న చింతలపూడి వెళ్లడానికి తెడ్లం, ప్రగడవరం తిరిగి 20 కిలో మీటర్లకు పైగా ప్రయాణించాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో అటు ఆర్థికంగా, అటు సమయాన్ని వృథా చేసుకుంటున్నామని ప్రజలు వాపోతున్నారు. ప్రభుత్వం రహదారి ప్రాధాన్యతను గుర్తించి చింతలపూడి నుంచి టి.నరసాపురం వరకు రహదారిని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని ముక్త కంఠంతో కోరుతున్నారు.

రోడ్డును అభివృద్ధి చేయాలి



టి.నరసాపురం – చింతలపూడి రహదారి ఏళ్ల తరబడి అధ్వానంగా ఉండటంతో దాతల సహకారంతో కొంత మేరకు గోతులను సరిచేశాం. మళ్లీ వర్షాలకు గోతులమయంగా మారింది. ప్రభుత్వం పూర్తిస్థాయిలో రహదారిని అభివృద్ధి చేయాలి.

– కటకం వెంకటేశ్వరరావు, సామాజికవేత్త, టి.నరసాపురం

ప్రభుత్వం స్పందించాలి



ఏ సమస్యకయినా కొద్ది కాలంలోనే పరిష్కారం లభిస్తుంది. కాని, చింతలపూడి, టి.నరసాపురం రహదారి 15 ఏళ్లుగా పరిష్కారం దొరకడంలేదు. ఫలితంగా రోడ్డు అధ్వానంగా మారింది. ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన ఈ రహదారిని అభివృద్ధి చేయాలి.

– టిక్కి సైదయ్య, ప్రైవేట్ ఉద్యోగి, టి.నరసాపురం

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సుమ, సిబ్బంది

కామవరపుకోట: బాలింతలు, గర్భిణులు పోషణతో కూడిన ఆహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యురాలు సుమ అన్నారు. బుధవారం తడికలపూడి సచివాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో గర్భిణులకు సుఖ ప్రసవాలపై అవగాహన కల్పించారు. నెలలు నిండిన ప్రతి గర్భిణీ ఆపరేషన్ లేకుండా సుఖ ప్రసవానికి తాను గర్భం దాల్చిన రోజు నుంచి డెలివరీ అయ్యే వరకు మంచి ఆరోగ్య అలవాట్లు చేసుకోవాలి సూచించారు. పండ్లు, కూరగాయలు, గుడ్లు, మాంసం, చేపలు వంటి పోషకాలు గల ఆహారాన్ని తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం తేలికపాటి వాయమాలు చేస్తూ కొద్ది దూరం నడుస్తూ ఉంటే తల్లికి బిడ్డకి కూడా మంచి ఆరోగ్యం ఏర్పడుతుందని వివరించారు. కార్యక్రమంలో హెచ్‌వీ జయలక్ష్మీకాంతం, ఎంఎల్ హెచ్‌పీ శివలక్ష్మి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్స్, 104 సిబ్బంది పాల్గొన్నారు.

22 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు



దసరా ఉత్సవాల ఆహ్వానపత్రికను విడుదల చేసిన దృశ్యం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం గ్రామ దేవత గంగానమ్మ దసరా నవరాత్రి మహోత్సవాలు ఈనెల 22 నుంచి నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది. బుధవారం ఆలయ ప్రాంగణంలో ఆహ్వాన పత్రికను విడుదల చేశారు. 22వ తేదీన బాలా త్రిపుర సుందరీ దేవిగా, 23న గాయత్రిదేవిగా, 24న అన్నపూర్ణాదేవిగా 25న కాత్యాయనిగా, 26న మహాలక్ష్మీదేవిగా, 27న లలితా త్రిపుర సుందరిదేవిగా, 28న మహాచండీ దేవిగా, 29న సరస్వతిదేవిగా, 30న శ్రీదుర్గాదేవిగా, అక్టోబర్ 1న నవమి పురస్కరించుకుని ఉదయం మహిషాసురమర్ధినిగా, సాయంత్రం మహాకాళీదేవిగా, 2న రాజరాజేశ్వరిదేవిగా గంగానమ్మ భక్తులకు దర్శనమివ్వనున్నట్లు తెలిపారు. శరన్నవరాత్రి ప్రతి రోజు సాయంత్రం పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో పాల్గొనదలచిన వారు గంగానమ్మ ఆలయం వద్ద లేదా ఫోన్ నంబర్లు 94410 69679, 91774 33335, 98666 88834, 73961 62002 సంప్రదించాలని కోరారు.

- ముత్యాలమ్మ ఆలయంలో ఈనెల 22 నుంచి 6వ దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ నిర్మాణకర్త భవిరిశెట్టి మురళీకృష్ణ, పద్మకుమారి దంపతులు తెలిపారు. బుధవారం ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రికను ఆధ్యాత్మిక సేవా ప్రతినిధి ఈమని శశి కుమార్ విడుదల చేశారు. ఈ ఏడాది 11 రోజులు ఉత్సవాలు నిర్వహిస్తామని, 10 అవతారాలతో పాటు కాత్యాయని అవతారంలో అమ్మవారు దర్శనమిస్తారని, రోజుకో విశేష ద్రవ్యాలతో జరిగే పూజలు భక్తులు పాల్గొనాలని కోరారు.
- విజయదుర్గమ్మ ఆలయంలో ఈ నెల 22 నుంచి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ శాశ్వత కమిటీ ఛైర్మన్ మారిశెట్టి రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి మాడా రామ్మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో ఉత్సవ ఏర్పాట్లను ప్రారంభించారు. ప్రధానార్చకులు మోహన్‌శర్మ రాట పాతి పూజలు చేశారు.
- నూకాలమ్మ దేవస్థానంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలకు బుధవారం ఉదయం 9.45 గంగటలకు శాస్త్రోక్తంగా పాలకర్ర పందిరి రాటపాతి ప్రధాన అర్చకులు కాళ్లకూరి శంకర్ మహేష్ శర్మ సంకల్ప పూజ చేశారు. ఆలయ శాశ్వత ఛైర్మన్ రాజాన సత్యనారాయణ, పోలుపర్తి రాము, గాలి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని నినాదాలు చేస్తున్న కార్మికులు

కొయ్యలగూడెం: ఈనెల 15న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి నారపల్లి రమణారావు పేర్కొన్నారు. బుధవారం మండలంలో ఆయన సీఐటీయూ నాయకులు శుక్లబోయిన రాంబాబుతో కలిసి పర్యటించారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డుని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. లేబర్ కార్యాలయం ముట్టడి చేపట్టనున్నట్లు తెలిపారు. పరింపూడి, పొంగుటూరు, అచ్యుతాపురం, కన్నాపురం, యర్రంపేట ప్రాంతాలలో సమావేశాలు నిర్వహించారు. లేబర్ ఆఫీస్ ముట్టడి కరపత్రం విడుదల చేశారు. అధికారంలోకి వస్తే వంద రోజుల్లో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని టీడీపీ కూటమి పాలకులను డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శుక్లబోయిన రాంబాబు మాట్లాడుతూ గత ఆరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న భవన నిర్మాణ కార్మికులకు క్లెయిమ్‌లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో మారిన పేర్రాజు, సీహెచ్ నారాయణ, మేడిన కన్నయ్య, సూల ప్రసాదు, కె.పెద్దిరాజు, దాసరి గంగాధర్‌రావు, అడపా నాగు, చదువుల అనిల్, దాసరి పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

సీఏలను తొలగించడం అన్యాయం



సందీప్‌కు వినతి పత్రం అందిస్తున్న బాధిత డ్వాక్రా సీఏలు

లింగపాలెం: మండలంలో వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులంటూ 11 మంది డ్వాక్రా సీఏలను తొలగించడం అన్యాయమని ఆ పార్టీ చింతలపూడి నియోజకవర్గం నాయకుడు సొంగా సందీప్ అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చిన్న ఉద్యోగులను తొలగిస్తూ వారి జీవనాధారం లేకుండా చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తున్నట్టు ఆయన చెప్పారు. తక్షణమే తొలగించిన సీఏలు ఎస్ మేరి (శ్రీకాకొల్లువారి గూడెం, పాశ్వానగరం), సీహెచ్ నిర్మల (భోగోలు), యు.మార్తమ్మ (రంగాపురం), టి.మరియకుమారి (తొమ్మండ్రుగూడెం), యు.సిద్ధమ్మ (తిమ్మక్కపాలెం), ఎస్ విజయకుమారి (శింగగూడెం), ఎ.నాగమణి (గోకవరం), ఎల్ భూలక్ష్మి (శింగగూడెం), ఎల్.తేరేజమ్మ (గోకవరం), ఎల్ దుర్గాంజలి (తిమ్మక్కపాలెం), కె.ప్రీతి (చార్లెస్‌నగర్)లను విధులలోకి తీసుకోవాలని సందీప్ డిమాండ్ చేశారు. పనిచేసిన పనిదినాలకు వేతనాలు చెల్లించకుండా కొత్తగా తీసుకున్న వారి ఖాతాలలో నగదు చెల్లించడం దారుణమని అన్నారు. వారిని విధుల్లోకి తీసుకోని పక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి

లింగపాలెం: పంటలు సాగు చేస్తున్న రైతులు తప్పనిసరిగా ఈ–పంట నమోదు చేసుకోవాలని చింతలపూడి సహాయ వ్యవసాయ సంచాలకులు వై.సుబ్బారావు సూచించారు. లింగపాలెం మండలం ములగలంపాడు, అన్నపనేని వారిగూడెం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుతం లింగపాలెం మండలంలో యూరియా నిల్వలు సరిపడా ఉన్నాయని, ఎవరూ ఆందోళన చెందవద్దని సుబ్బారావు అన్నారు. యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా ఉందన్నారు. కార్యక్రమంలో రైతులు బొల్లినేని పుల్లారావు, అన్నపనేనివారిగూడెం సర్పంచ్ దొడ్డిగర్ల రవీంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

పీఏఐ శిక్షణ కార్యక్రమం

లింగపాలెం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పీఏఐ (పంచాయత్ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్)పై ఎంపీపీ ముసునూరి వెంకటలక్ష్మి, డిప్యూటీ ఎంపీడీఓ ఎ.సుందరిల ఆధ్వర్యంలో బుధవారం శిక్షణ ఇచ్చారు. భారతదేశంలో గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధి, పనితీరు, పురోగతిని అంచనా వేయడానికి, ట్రాక్ చేయడానికి రూపొందించిన బహుమితీయ సూచికపై శిక్షణ ఇచ్చానట్టు వారు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, లైన్ డిపార్ట్‌మెంట్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ కోర్సు ప్రారంభం

జంగారెడ్డిగూడెం: స్థానిక సీఎస్‌టీఎస్ కళాశాలలో ఫౌండేషన్ ఆఫ్ ఆప్టిట్యూట్ సర్టిఫికెట్ కోర్సును ప్రారంభించినట్టు ప్రిన్సిపాల్ ఎస్.ప్రసాదబాబు తెలిపారు. బుధవారం కళాశాలలో గణిత శాఖ విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 45 రోజులపాటు గణిత శాస్త్ర విభాగం నిర్వహించే సర్టిఫికెట్ కోర్సును సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అధ్యాపకులు సీహెచ్ బదరీ నారాయణ, ఎం మధు, టీవీ రాంబాబు, సీహెచ్ రమాదేవి, సీహెచ్ షాలి పాల్గొన్నారు.

మత్స్య సంపద యోజన నిధులు వినియోగించుకోవాలి



బాలకృష్ణకు అనుమతి పత్రం అందిస్తున్న జిల్లా మత్స్యశాఖ అధికారి నర్సయ్య

ద్వారకాతిరుమల: ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన నిధులను మత్స్య సహకార సంఘాలు మత్స్య సంపద అభివృద్ధి సంస్థ కార్యాలయాల కార్యకలాపాలకు వినియోగించాలని ఏలూరు జిల్లా మత్స్యశాఖ అధికారి నర్సయ్య సూచించారు. ఈ మేరకు అనుమతి పత్రాలను లబ్ధిదారులకు బుధవారం ఆయన తన కార్యాలయంలో అందజేశారు. ద్వారకాతిరుమల మండలం తిరుమలంపాలెం మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు బంటుమిల్లి బాలకృష్ణ మాట్లాడుతూ ఈ పథకం మత్స్య సహకార సంఘాలకు ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. రాబోయే రోజుల్లో మత్స్య సంపద అభివృద్ధికి మరింత కృషి చేయాలన్నారు. జిల్లాలో మత్స్య సహకార సంఘాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కూడా మత్స్యకారులకు నిధులు కేటాయించి, అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో ఎఫ్‌డీఓ లీలాదేవి, ఆప్కాఫ్ సిబ్బంది ఆను ప్రసాద్, రేవతి దేవి, నాగేశ్వరావు, శ్రీను, వెంకటేశ్వర్లు, మత్స్యకార సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

వ్యాసరచన విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

చింతలపూడి : తంటిపూడి ఫౌండేషన్ ఫర్ బహుజన్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో నిర్వహించిన 2047 నా కలల భారత దేశం వ్యాసరచన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. చింతలపూడిలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను విద్యార్థులు బి.హర్షిత, ఎ.దినేష్ కార్తీక్, వై.లోకేష్‌లకు అందజేశారు. కోరుకొల్లు గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ కెమిస్ట్రీ లెక్చరర్ మూర్తి, లైన్స్ క్లబ్ అధ్యక్షులు అడప శ్రీనివాస్, లైన్ మెంబర్ అబ్బియ్య, ఫౌండేషన్ ఫర్ బహుజన్ వెల్ఫేర్ ఫౌండర్ సెక్రెటరీ వరప్రసాద్ పాల్గొన్నారు.

యూరియా, ఎరువులకు కొరత లేదు

పోలవరం రూరల్: జిల్లాలో యూరియా, ఇతర ఎరువులకు కొరత లేదని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్‌కే హబీబ్ బాష అన్నారు. ఆయన పోలవరం మండలం ప్రగడపల్లి సొసైటీ వద్ద యూరియా పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. పోలవరం వ్యవసాయ శాఖ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రగడపల్లి సొసైటీలో 25 మెట్రిక్ టన్నులు, జిల్లెళ్లగూడెం, వింజరం పరిధిలో రైతులకు 12.500 మెట్రిక్ టన్నులు పంపిణీ చేస్తామన్నారు. గోడౌన్‌లో స్టాకు ఉందని తెలిపారు. వింజరం పరిధిలోని రైతులకు అక్కడే ఎరువులు పంపిణీ చేశామన్నారు. పట్టిసీమ, కృష్ణారావుపేట సొసైటీలకు 45 మెట్రిక్ టన్నుల యూరియాను రెండు రోజుల్లో సరఫరా చేస్తామని తెలిపారు. పోలవరం మండలంలో 6400 హెక్టార్లలో వరి పంట సాగు చేస్తున్నారని, ఇందుకు అవసరమైన ఎరువులన్నీ అందుబాటులో ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీ బుచ్చిబాబు, మండల వ్యవసాయ శాఖ అధికారి కె.రాంబాబులు పాల్గొన్నారు.

మారణహోమాన్ని నిలుపుదల చేయాలి

జంగారెడ్డిగూడెం: పాలస్తీనాలో మానవ మారణహోమాన్ని నిలుపుదల చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యులు కేవీ రమణ డిమాండ్ చేశారు. ఈనెల 8 నుంచి మూడు రోజులు భారత పర్యటన చేస్తున్న ఇజ్రాయిల్ ఆర్థిక మంత్రి బెజలెల్ స్మోట్రిచ్ పర్యటన నిరశిస్తూ దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ పిలుపుమేరకు జంగారెడ్డిగూడెం బోసు బొమ్మ సెంటర్ దగ్గర నిరసన వ్యక్తం చేశారు. ఐఎఫ్‌టీయూ డివిజన్ అధ్యక్షులు మంచిలి రాజు, పట్టణ కార్యదర్శి మొల్లేటి శ్రీను, గంపల శ్రీను, కత్తుల వెంకటేశ్వరరావు, వసంత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే గేటు మూసివేత నిర్ణయం మానుకోవాలి



భీమడోలు పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

భీమడోలు: జాతీయ, రాష్ట్రీయ రహదారులను కలిపే భీమడోలు రైల్వే గేటును మూసివేస్తే జన జీవనం అస్తవ్యస్తంగా మారుతుందని, రైల్వే గేటు మూసివేసే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ గ్రామస్తులు తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం సాయంత్రం భీమడోలు రైల్వే గేటు మూసి వేయాలన్న నిర్ణయంపై రెవెన్యూ, పంచాయతీ అధికారులు గ్రామసభను ఏర్పాటు చేశారు. రైల్వే గేటు మూసి వేసేందుకు రైల్వే శాఖ తీసుకున్న నిర్ణయాన్ని సంబంధిత అధికారులు గ్రామస్తులకు వివరించారు. దీంతో వారు రైల్వే గేటు మూతను ముక్తకంఠంతో వ్యతిరేకించారు. అనంతరం వినతిపత్రాన్ని అందించారు. భీమడోలు పంచాయతీ పరిధిలోని పెదలింగంపాడు, చినలింగంపాడు, దిగురుపాటి దిబ్బ గ్రామాలకు చెందిన 3 వేల మంది, 5 వేల ఎకరాల్లోని వరి చేలు, ఆక్వా చెరువులు రైల్వే గేటుకు అవతల పక్క ఉన్నాయని, నిత్యం ఆ గ్రామాల ప్రజలు, విద్యార్థులు, రైతులు భీమడోలు గ్రామానికి రాకపోకలు సాగిస్తున్నాయని, రైల్వే గేటు మూసి వేస్తే వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారుతుందని, దీని వలన తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని వారు వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. రైల్వే గేటు మూసివేతను ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించబోమని తేల్చి చెప్పారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని పంచాయతీ కార్యదర్శి కేవీ తనూజ తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ శేషపు శేషగిరి, వీఆర్వోలు వెజ్జు వినయ్, వీరప్రతాప్, గ్రామ ప్రముఖులు చింతా శ్రీరామచంద్రమూర్తి, కుక్కల ప్రసాద్, పైడిమాల యుగంధర్, ముప్పిరిశెట్టి సుబ్రహ్మణ్యం, ఈతకోట సత్యకృష్ణ, ఆదిరెడ్డి సత్యనారాయణ, వెంకటరమణ, రామిశెట్టి గోపి, బెంజిమన్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లై ఓవర్ నిర్మాణానికి సహకరించాలి

ఉంగుటూరు: ఫ్లై ఓవర్ నిర్మాణం పూర్తయితే రైల్వేగేటు సమస్య ఉండదని డీటీ పోతురాజు తెలిపారు. బుధవారం కైకరం పంచాయతీ కార్యాలయం వద్ద ప్రజలకు ఫ్లై ఓవర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీటీ మాట్లాడుతూ ఫ్లైఓవర్ మంజూరైందని నిర్మాణానికి అందరూ సహకరించాలని కోరారు. అభ్యంతరాలు ఉంటే తెలియజేయొచ్చన్నారు. వీఆర్వో నాగేశ్వరరావు, సర్పంచి సలగల గోపి, సర్వేయర్లు, ప్రజలు పాల్గొన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్



సమావేశం నిర్వహిస్తున్న జడ్జి కిషోర్‌కుమార్

జంగారెడ్డిగూడెం: రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఆదేశాల మేరకు ఈనెల 13న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ కిషోర్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేవిధంగా కక్షిదారులకు అవగాహన కల్పించాలని, ప్రతి ఒక్కరు ఈ జాతీయ లోక్ అదాలత్‌కు సహకరించాలని కోరారు.

గంగమ్మ ఒడికి గణనాథుడు

కొయ్యలగూడెం: స్థానిక కోపరేటివ్ బ్యాంకు వీధిలో కొలువైన గణనాథుని ఊరేగింపును బుధవారం ఘనంగా నిర్వహించారు. కేరళ డప్పు వాయిద్యాలు, కాంతారావు వేషధారణలు, కాళికా నృత్య ప్రదర్శనలు, బుట్ట బొమ్మలు తదితర సాంస్కృతిక కార్యక్రమాల నడుమ 18 అడుగుల స్వామివారి విగ్రహాన్ని ఊరేగించారు. స్వామి వారి లడ్డూలను యువకులు వేలంలో దక్కించుకున్నారు. 15 రోజుల పాటు నిర్వహించిన చవితి ఉత్సవాలు పరిసమాప్తం అయ్యాయి.